విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

వైసీపీ సెల్ఫ్‌గోల్

- ప్రతిపక్షాలపై విమర్శలకే ప్రాధాన్యత
- అభివృద్ధిపై నోరు మెదపని ముఖ్యమంత్రి జగన్

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: అధికారం చేతిలోకి వచ్చిన తర్వాత దాన్ని పోగొట్టుకోవాలని ఎవరూ అనుకోరు. నిలబెట్టుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తారు.మొదటి మూడేళ్లు ఎలా రాజకీయంచేసినా.. ఎలా పరిపాలన చేసినా.. చివరి రెండేళ్లు మాత్రం రాముడు మంచి బాలుడు తరహాలో ప్రభుత్వం చాలా మంచిది అనే భావన ప్రజలకు కల్పించడానికి శతవిధాలా ప్రయత్నాలు చేస్తారు. విపక్షాలు ఎంత రెచ్చగొట్టినా తమ ప్లస్ పాయింట్లను హైలెట్ చేయడానికే ప్రయత్నిస్తాయి. కానీ ఈ సంప్రదాయ రాజకీయానికి వైసీపీ అధినేత జగన్ తిలోదకాలిచ్చారు. ఎన్నికల చివరి వరకూ.. తనదైన ఉద్రిక్తతల రాజకీయం చేస్తున్నారు.

పాలనపై వ్యతిరేకత

రాష్ట్ర ప్రభుత్వం పాలనా తీరుపై ఎప్పుడూ ఏదో ఒక వ్యతిరేక ప్రచారమే జరుగుతూ ఉంటుంది. గత నాలుగున్నర ఏళ్లుగా అమరావతి నుండి పోలవరం వరకు అన్ని విషయాలలోనూ విపక్షాలు ఎప్పుడూ ఏదో ఒక విమర్శ చేస్తూనే ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతాంగం పై దాడులు కేసులు ఎక్కువయ్యాయి. ఉద్యోగులలో అయితే ఎన్నికలు దగ్గర పడుతున్న అవే ఉద్రిక్తతలు వ్యక్తం అవుతున్నాయి.

అభివృద్ధి శూన్యం

వైసీపీ ప్రభుత్వం ఏకైక లక్ష్యం సంక్షేమం. అభివృద్ధిని పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రజలందరికి ఇళ్లకు వెళ్లి పథకాలు అందించడమే టార్గెట్‌గా పెట్టుకుంది. దీన్ని ప్రచారం చేసుకోవ దానికి మూడేళ్ల కిందటి నుంచి ప్రణాళికలు రూపొందించింది. గడపగడపకు మన ప్రభుత్వం, స్పందన, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం ఇలా వరుస కార్యక్రమాలు ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ ఈ ప్రచారంలో ప్రజలు ప్రజాప్రతి నిధులను నిలదీస్తే దాడులు చేసి కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కే సభలో కూడా తన సంక్షేమ పథకాల ప్రచారం చేసుకుని మిగిలిన సమయం విపక్షాలను విమర్శించడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ కారణంగా ప్రతిపక్షాల విమర్శలు హైలెట్ అవుతున్నాయి. అందుచేత ప్రభుత్వ పథకాల ప్రభావం ప్రజలపై తక్కువగా ఉంది.

కక్ష సాధింపు చర్యలు

రాజకీయాలలో కక్ష సాధింపులు బాధితులకు అద్భుతమైన అవకాశాన్ని ఇస్తాయి. ప్రజలు సానుభూతి చూపిస్తారు. ఎక్కడైనా రాజకీయ పార్టీలు ప్రత్యర్థులపై వేధింపులకు పాల్పడే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తాయి. ఇబ్బంది పెట్టాలి అనుకుంటాయి. కానీ ప్రజల నుంచి సానుభూతి లభించేంతగా చేయాలని అనుకోవు. గత నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో విపక్ష పార్టీ నేతలపై ఎప్పుడూ జరగనన్ని దారుణాలు జరిగాయని, రాజకీయంగా ప్రభుత్వం మారితే అధికార పార్టీ నేతలు ఇబ్బంది పడతారు అన్న చర్చ సర్వత్రా జరుగుతోంది.

ప్రస్తుతం రాజకీయాలలో వైసిపి పాలనలోని వైఫల్యాలపైనే వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి. వైసిపి నమ్ముకున్న పథకాలు, సంక్షేమంపై మాత్రం చర్చ జరగడం లేదు. దీనికి ఆ పార్టీ చేసుకున్న స్వయంకృతమే కారణమని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

క్రైస్తవులకు జగన్ అండ

విశాలాంధ్ర - భీమవరం టౌన్: క్రైస్తవులకు జగన్ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక బేతనిపేటలో 300 ఏళ్ల క్రితం నిర్మించిన మిషన్ హాస్పిటల్ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ హాస్పిటల్ కు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. హాస్పిటల్ నందు జిల్లాలో ఉన్న ప్రజలు గతంలో వైద్య పరంగా వినియోగించుకునే వారన్నారు.అంత ఘన చరిత్ర కలిగిన హాస్పిటల్ కి నేటికీ అదే గొప్పతనం ఉందన్నారు. ఈయన వెంట తోట భోగయ్య,గంట సుందర్ కుమార్,ఎం కరుణాకర్,పీ డీ విల్సన్, బందెల సునీల్ తదితరులు ఉన్నారు.

అనాధలకు బియ్యం పంపిణీ

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో అనాథలకు, పేదలకు సేవ చేస్తున్న దాతను పలువురు అభినందించారు. కైకరం గ్రామానికి చెందిన వెజ్జు దుర్గ వెంకట సుబ్బారావు అమ్మాయి అక్షర పుట్టినరోజు సందర్భంగా ఎయిడ్స్ పేషెంట్స్ కి స్వేచ్ఛ మహిళా సంఘం అధ్యక్షులు ధర్మ ఆధ్వర్యంలో చేబ్రోలు గవర్నమెంట్ హాస్పిటల్‌లో వారికి నెలకి సరిపడా ప్రోటీన్ ఫుడ్,భోజనం, చేబ్రోలు, ఉంగుటూరు అనాధ ఆశ్రమంలో భోజనం2నెలలకు సరిపడా బియ్యం అందించారు. తాడేపల్లిగూడెం మండలం పడాల ఆశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఈ వైద్యులు డాక్టర్ కలిదిండి వర్మ, మాజీ సర్పంచి రాందే రాజారావు, దిడ్ల శ్రీనివాస్, ఉంగుటూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నల్లా ఆనంద్ కుమార్, పలువురు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - మండవల్లి: చిన్ననాటి స్నేహితుల ఆత్మీయ పలకరింపులతో మండవల్లి జడ్పీహెచ్ పాఠశాల ఆవరణ ఆదివారం సందడిగా మారింది. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. 2005-06 సం.లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కలుసుకుని చిన్ననాటి మధురస్మృతులను తలచు కుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఆనాటి రోజుల్లో వారు చేసిన చిలిపిచేష్టలను గుర్తుకు తెచ్చుకొని మనసారా నవ్వుకున్నారు.ఒకేచోటచేరి కబుర్లు చెప్పుకున్నారు. తాముచదివిన పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారంగా ఐరన్ బీరువాను అందజేశారు. చదువులు చెప్పిన గురువులు జానకి రామారావు, కొండలరావు, పి.వెంకటేశ్వర రావు, మురళీకృష్ణ, పిఈటి విజయ్, రామారావు, రత్న కుమారు, సుబ్రహ్మణ్యం, బేగం, కరుణ, ప్రభావతి, మహాలక్ష్మి లను శాలువాలు కప్పి వారి ఆశీర్వాదాలు తీసుకుంటూ, మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ 18 స.ల క్రితం విద్యాబుద్ధులను నేర్పిన గురువులను గుర్తుంచుకొని సాదరంగా ఆహ్వా నించి సత్కరించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

కొవ్వాడ గ్రామపంచాయతీ పరిధిలో పులి పాదముద్రికల గుర్తింపు

విశాలాంధ్ర-ఏలూరు: బుట్టాయిగూడెం మండలం కొవ్వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొవ్వాడ గ్రామ పరిసరాలలో పులి పాదముద్రికలు గుర్తించినట్టు డిఎఫ్‌వో రవీంద్ర ధామ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొవ్వాడ సమీప గ్రామాలైన రాజవరం, యర్రయిగూడెం, కామయ్యకుంట, లంకాలపల్లి, నాగన్నగూడెం, బందార్లగూడెం, పందుగూడెం, కోపల్లి, వీరన్నపాలెం, డిప్పకాయలపాడు, కన్నాపురం గ్రామ ప్రజలు కూడ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. పులి తిరుగు ప్రయాణంలో ఉన్నట్లుగా పాదముద్రికల ద్వారా గుర్తించామన్నారు. అటవీశాఖ పులి సంచరించే ప్రాంతానికి అన్నివైపుల చుట్టూ 10 కి.మీ. దూరం లో ఉన్న సుమారు 10 గ్రామాలప్రజలను అప్రమత్తం చేయుటకు మైకు ద్వారా ప్రచారం చేసినట్టు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: నాటుసార విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ ఐ డి. దుర్గా మహేశ్వర రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బండివారిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి ప్రభుత్వంచే నిషేధించబడిన నాటుసారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఆదివారం తన సిబ్బందితో దాడిచేసి అతని వద్ద నుండి 5లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లుగా ఆయన తెలిపారు.

సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

విశాలాంధ్ర-ఏలూరు: సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ ఘంట పద్మశ్రీ ప్రసాద్ ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో అన్నారు. పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ లక్షలాదిగా 3 ఉమ్మడి జిల్లాలలో 50 నియోజకవర్గాలనుంది వచ్చిన అశేష ప్రజానికానికి పార్టీ నాయకులకు కార్యకర్తలకు సిద్ధం కార్యక్రమము విజయవంతము కావటంలో అందరి కృషి మరవలేనిదన్నారు. సభలో మీడియా కవరేజికి వచ్చిన మీడియా ప్రతినిధులపై జరిగిన అనూహ్య దాడికి చింతిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షులు ఘంట ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు పద్మావతికి పలువురు నివాళులు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : పేద ప్రజల గుండెల్లో శరగని ముద్ర వేయించుకున్న దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎప్పటికీ ప్రజల గుండెల్లో ఉంటారని ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం గ్రామంలో కొల్లూరి పద్మావతి రెండవ వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవరు శ్రీనివాస్ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పోలవరం ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే జగన్ మరల అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో దర్భగూడెం సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, దర్భగుడెం సర్పంచ్ సున్నం ఉషారాణి, ఉప సర్పంచ్ కేతిరెడ్డి రాఘవరెడ్డి, తాటి ఆకులగూడెం ఎంపీటీసీ సున్నం సురేష్, సచివాలయం కన్వీనర్ పైడిమర్ల జగన్మోహన్ రెడ్డి, కొప్పుల చౌదరి, రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ సిద్ధాంతాలను ముందుకు తీసుకు వెళ్ళాలి

విశాలాంధ్ర - కైకలూరు : చదువుతోనే విజ్ఞానం వస్తుందని, చదువుతోనే వివేకం వస్తుందని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పేర్కొన్నారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్,శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ

వెంకటరమణ మండలంలోని రాచపట్నం ప్రధాన కూడలిలోని భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి విగ్రహ ఆవిష్కరణ చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో కైకలూరులో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలందరికి సమాన న్యాయం అందించడమే వైయస్సార్సీపి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇటువంటి ప్రభుత్వంలో పనిచేస్తున్నందుకు నిజంగా గర్వపడుతున్నానని పేర్కొన్నారు. శాసన మండలి సభ్యులు జయ మంగళ వెంకటరమణ మాట్లాడుతూ ముఖ్యంగా యువత అంబేద్కర్ ఆశయ సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్ తరాల వారికి ఒక మార్గదర్శకులుగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు కురేళ్ళ బేబీ, బొర్రా సత్యవతి, ఏఎంసి చైర్మన్ చేబోయిన వీర్రాజు, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, బొడ్డు నోబుల్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య,జయమంగళ కాసులు, అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు, అంబేద్కర్ యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతన వెతలు

విశాలాంధ్ర- ద్వారకాతిరుమల : మండల కేంద్రమైన ద్వారకా తిరుమల మేజర్ పంచాయతీలో సిబ్బందికి జీతాలు ఇవ్వని దుస్థితి ఏర్పడింది, గత 6నెలలుగా జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. నెలమొత్తం పనిచేసి నెలాఖరుకు జీతం పొందే విధానం ద్వారకాతిరుమల మేజర్ పంచాయతీలో పనిచేసే కార్మికులకు వర్తించడం లేదు. వీరికి గత 6నెలలుగా జీతాలు చెల్లించక అధికారుల్ని, పాలకవర్గాన్ని వేడుకున్నా వీరి మొర ఆలకించడం లేదు. కనీసం సర్పంచ్‌కాని, పాలక వర్గసభ్యులుగాని వీరికి జీతాలు ఇచ్చే ప్రయత్నం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్వారకా తిరుమల పంచాయతీలో 23మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనీసం జీతాలు పెంచమని అడగడం లేదని, అరకొర జీతాలు ఇస్తున్నా ఎప్పుడు రోడ్డెక్కలేదని, మాకు నెలకు ఇచ్చే 9వేలు జీతాన్ని కూడా మాకు ఇవ్వకుండా ఏడిపిస్తున్నారని అన్నారు. 6నెలలు జీతాలు ఇవ్వకుండా నిలిపివేస్తే మేము ఏవిదంగా బ్రతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండురోజుల్లో వీరికి జీతాలు చెల్లించకపోతే నిరవధికంగా విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీరికి జీతాలు చెల్లించే ప్రయత్నం చేయాలని కార్మికులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులుగా వాసు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులుగా జీలుగుమిల్లి మండలానికి చెందిన మద్దుల వాసు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఏలూరులో సి ఆర్ రెడ్డి ఆడిటోరియంలో ఈ ప్రమాణ స్వీకారం చేశారు.

అధ్యక్షులుగా వెలగ శ్రీరామ్ మూర్తి కూడా ప్రమాణ స్వీకారం చేశారు .ఈ సందర్భంగా మద్దుల వాసు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఆర్యవైశ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్యుల బలోపేతానికి సమైక్యంగా ఉండి అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈయన వాసవి క్లబ్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ గా ఎన్నో సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కక్కిరాల ఉపేంద్ర, కొనకళ్ళ వెంకన్న, మాతంశెట్టి ఖాదర్ బాబు, కోరుకొండ ఖాదరబాబు, చిట్టూరి సూర్యనారాయణ, చిన్ని దుర్గారావు, కొనకళ్ళ వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో రక్షణ కరువు

విశాలాంధ్ర-కామవరపుకోట: వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ అధికారులు, కవులు, కళాకారులు, దళితులకు రక్షణ కరువైపోయిందని సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖలో తహసిల్దార్ ను హత్య చేయడం ఈ రాష్ట్రాన్ని రౌడీలు గుండాలు పాలిస్తున్నారని అనడా నికి ఒక నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికార పగ్గాలు చేపట్టాక దళిత, బలహీన వర్గాల మహిళలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి బటన్ నొక్కి ప్రజలకు మేలు చేస్తానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మౌలిక సమస్యలు పక్కనపెట్టి సంక్షేమ జపం చేస్తూ పాలన సాగిస్తున్న జగన్ రెడ్డి సిద్ధం అని సభలు పెట్టి ఉపన్యాసం చెబితే తిరిగి మళ్ళీ జగన్ రెడ్డిని అధికారులు తీసుకురావడానికి ప్రజల సిద్ధంగా లేరన్నారు. మోసపూరిత మాటలతో సిద్ధం అంటే జగన్ రెడ్డిని ప్రజలు నమ్మరని, రాబోయే ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడిస్తారని హెచ్చరించారు.

బతికి ఉన్న వారిని చనిపోయినట్టు చూపుతున్న సంఘటనపై దర్యాప్తు

- విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - లింగపాలెం : భోగోలు పంచాయతీ వెంకటాపురంనకు చెందిన రాధాదేవి, నరసన్నపాలెంలో అనూషలను బతికి ఉన్నా మృతి చెందినట్టు రికార్డుల్లో చూపుతున్న సంఘటనను విశాలాంధ్ర వెలుగులోకి తేవటంతో జిల్లా అధికారులు స్పందించారు. వీరికి సంబంధించిన వివరాలను నివేదిక రూపంలో అందించాలని లింగపాలెం మండల ఉప తహశీల్దార్ సునీతను ఆదేశించారు. దీంతో భోగోలు, నరసన్నపాలెం గ్రామ రెవెన్యూ అధికారులు శర్మ, రంగారావులు బాధితుల ఇళ్ళకువెళ్ళి ఆదివారం వివరాలు సేకరించారు. రేషన్‌కార్డులో పేర్లు మార్చే సమయంలో డెత్ అని పొరపాటున నమోదు చేయటం వల్ల ఈ సమస్య వచ్చిందని డిప్యూటీ తహశీల్దార్ తెలిపారు. త్వరలో వీరి పేర్లను రేషన్‌కార్డులో నమోదు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వీటికి సంబంధించిన నివేదికను జిల్లా అధికారులకు పంపామని అన్నారు. బాధితుల వివరాల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక గ్రామస్థాయి అధికారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరినట్టు డిప్యూటీ తహశీల్దార్ సునీత తెలిపారు.

బొట్టు విజయ్ చౌదరి ఆశయాలకై పయనిస్తాం

విశాలాంధ్ర-చాట్రాయి: అమరజీవి బొట్టు విజయ్ చౌదరి ఆశయాల కోసమై అనునిత్యం పయనిస్తామని, తెదేపాని ఏకతాటి మీదికి తీసుకొస్తామని పార్టీ విజయమే తమ ధ్యేయమని టిడిపి మండల మాజీ అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి తెలిపారు. చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామంలో బొట్టు విజయ్ చౌదరి నివాసంలో టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. చింతలపూడిలో జరగనున్న చంద్రబాబు రా కదలిరా సభను జయప్రదం చేయడం కోసం సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ చాట్రాయి మండలంలోని 18 గ్రామాలలో తెదేపా గ్రూపులుగా విడిపోయిన సందర్భంగా తన భర్త దివంగత నేత బొట్టు విజయ్ చౌదరి తన తుది శ్వాస విడిచే వరకు పార్టీని సమన్వయం చేయడానికి ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. గడచిన రెండు సంవత్సరాల కాలంలో పార్టీ చీలికలు పేలికలై పోయిందన్నారు. మండల పార్టీ బాధ్యతలు ఎవరు చూసినప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తన కొడుకు ఎన్ఆర్ఐ బొట్టు వంశీ పార్టీకి నిధులను సమకూర్చినట్టు తెలిపారు. కొద్ది రోజులలో అసెంబ్లీ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో కూడా తగాదాలు యధావిధిగానే కొనసాగుతున్నాయని తెలుగుదేశం పార్టీ విజయం సాధించడం కోసం తాము శక్తివంచన లేకుండా పనిచేయడానికి ముందుకు వస్తున్నామని మీరంతా సహకరించాలని కోరారు. రాష్ట్ర కార్యాలయం లెక్కలలో మండల పార్టీ అధ్యక్షునిగా నేటికీ తన భర్త బొట్టు విజయ్ చౌదరి పేరే కొనసాగుతుందని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవ రెడ్డి మాట్లాడుతూ చింతలపూడిలో జరుగనున్న చంద్రబాబు బహిరంగ సభకు భారీ ఎత్తున ప్రజా సమీకరణ చేద్దామని ఆర్థిక అవసరం వున్న వారికి బొట్టు వంశీ సహాయం చేయడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొట్టురామచంద్రరావు,మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, లీగల్ సెల్ జిల్లా నాయకులు శ్రీనివాసరావు, మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ముఖ్యమైన నాయకులు హాజరయ్యారు.

టీవీ రామకృష్ణకు అభినందనలు

విశాలాంధ్ర-పెంటపాడు: పెంటపాడు కు చెందిన ఎంఈఓ 2 టీవీ రామకృష్ణ ఏపి మండల విద్యాశాఖాధికారుల-2 రాష్ట్ర కన్వీనర్ గా ఎంపికైన సందర్భంగా శనివారం రాత్రి పెంటపాడులో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మండల సమావేశ మందిరంలో పెంటపాడు మండల ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయ సంఘాలు ఆయనను సన్మానించాయి. ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ సంఘ నేతగా రామకృష్ణ సేవలు అభినందనీయమని పలు సంఘాల నేతలు కొనియాడారు. ఈ సందర్భంగా టీవీ రామకృష్ణ మాట్లాడుతూ ఎంఈఓ-2 సంఘానికి తనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకున్న సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ టిఎఫ్ సంఘం నాయకులు రమేష్, స్టాన్లీ బాబు, శామ్యూల్ రాజు, పలు సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లవరం లంకలో కోడిపందాలు

- 23 మంది అరెస్టు
- 26 కోళ్లు, రూ. 4.90లక్షలు స్వాధీనం
- 8 కార్లు, 30 ద్విచక్రవాహనాలు సీజ్

విశాలాంధ్ర-నరసాపురం: కోడిపందాల స్థావరాలపై దాడులు నిర్వహించి 23 మందిని అరెస్టు చేసి, 8 కార్లు, 30 ద్విచక్ర వాహనాలతో పాటు, 26 కోళ్లు,57 కత్తులు రూ.4.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ గోవిందరాజు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆదివారం రూరల్ మండలం మల్లవరం లంక గ్రామంలో అనుమతి లేకుండా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న కోడిపందాలు స్థావరంపై తమ సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తును సీజ్ చేశామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ పందాలలో స్థానిక పెద్దల భాగస్వామ్యం, సహకారంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు సమాచారం. పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు గ్రామస్తులు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అయితే పోలీసులకు తెలియకుండానేకోడిపందాలు మల్లవరంలంక పరిసరగ్రామాలలోగుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బటన్ నొక్కారు...పనులు ప్రారంభం కాలేదు

విశాలాంధ్ర-నరసాపురం: నర్సాపురం నియోజకవర్గంలో రూ.3,600 కోట్లు మేజరు పనులకు ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి శంకుస్థాపన చేశారు. నేటికీ ఒక్క రూపాయి పని కూడా ప్రారంభించలేదని మాజీ ఎమ్మెల్యే బందారు మాధవ నాయుడు మండిపడ్డారు. ఆదివారం ఆయన తీర ప్రాంతంలో పరిస్థితి పర్యటించి ఫిషింగ్ హార్బర్ శషవతారం ఛానల్ వశిష్ట వారది తదితర ప్రారంభం కానీసనులపై ఆయన ఘాటుగా స్పందించారు. పట్టణంలో ఆయన నివాసం నుంచి పార్టీ నాయకులు, జనసేన కార్యకర్తలుతో కలిసి ర్యాలిగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే దీర్ఘకాల పెండింగ్ పనులపై పేపర్ ప్రకటనకే పరిమితం అయ్యారని, పనులు చేపట్టడంలో విఫలం అయ్యారని విమర్శించారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తారని హామీ ఇచ్చిన ఆయన దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తున్నారని విమర్శించారు.

అన్ని వర్గాలను మోసం చేసిన జగన్

విశాలాంధ్ర -భీమవరం: బీసీలంతా ఐకమత్యంతో తెదేపా, జనసేన అభ్యర్థులను గెలిపించాలని, బిసిలకు న్యాయం చేసే ఏకైక పార్టీ టిడిపినేనని టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి అన్నారు. శ్రీనివాస్ థియేటర్ సెంటర్‌లో కృష్ణ బలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టిడిపి బిసి సాధికారిత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు ఆధ్వర్యంలో జయహో బిసి, బిసి పోరుబాట, బిసి సాధికారిత కమిటీ రాష్ట్ర సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెంటే మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రం మనదేనని ఐదేళ్ల లో రాజధాని లేకుండానే జగన్ ప్రభుత్వం పరిపాలన సాగించిందని విమర్శించారు. టిడిపి బిసి సాధికారిత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ జగన్ గర్వంతో ఉన్నాడని రాష్ట్రంలో అభివృద్ధి అనేది లేదని, జగన్ ముఖ్యమంత్రి కాదని, సైకో ముఖ్యమంత్రి అని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గంటా నాగలక్ష్మి, టిడిపి కృష్ణ బలిజ సాధికారిత కమిటీ రాష్ట్ర కన్వీనర్ కావేటి వేణు, డైరెక్టర్ సిహెచ్ ప్రసాద్, జగదీష్, వి.నాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాస్, నన్నుబోలు రాధాకృష్ణ, నన్నుబోలు మణికంత, టిడిపి సీనియర్ నాయకులు మద్దుల రాము, మైలబత్తుల ఐజాక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎం.ఎల్.హెచ్.పి అభ్యర్థులు రిపోర్ట్ చేయాలి

విశాలాంధ్ర -భీమవరం: రాజమండ్రి ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ జోన్ - 2 పరిధిలో ఎం.ఎల్.హెచ్.పి/సిహెచ్ఓ పోస్టులకు సెలెక్ట్ అయిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లుతో సోమవారం తమ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ పి.పద్మా శశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరు పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో ప్రకటించి ఈ నెల 12 వరకు దరఖాస్తులు స్వీకరించామని పరిశీలనంతరం మెరిట్ లిస్టును జోన్-2 పరిధిలో ఆయా జిల్లాల వెబ్‌సైట్స్‌లో అప్ లోడ్ చేశామని సదరు అభ్యర్థులు ఉదయం 10 గంటలకు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని తమ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆమె సూచించారు.

రాష్ట్రంలో అధికారులకు, ప్రజలకు రక్షణ లేదు

విశాలాంధ్ర-ఏలూరు : రాష్ట్రంలో ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందని తెదేపా ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించే రెవెన్యూ అధికారులకు రక్షణ లేకుండా పోయిందని, విశాఖలో జరిగిన తహసీల్దార్ హత్య ఉదంతమే దీనికి నిదర్శనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రమణయ్యను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి త్వరగా శిక్ష పడేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో రెవెన్యూ అధికారులు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారన్నారు.

ఇంటి వద్దకే పాలన

విశాలాంధ్ర - కైకలూరు : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి నిజమైన అర్థం చేకూరుస్తూ గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకే పాలనను అందిస్తూ జగన్ సహకారం చేస్తున్నారని, అటువంటి నాయకులను ఆదరించడం అందరి కర్తవ్యమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పేర్కొన్నారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్, శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణలు కైకలూరు మండలం వరాహపట్నంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన రూ.43.60 లక్షల నిధులతో గ్రామ సచివాలయం భవనం, రూ.20.80 లక్షల నిధులతో వైయస్ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనములకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి శిలా ఫలకములను ఆవిష్కరించారు. తొలుత అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీతో వరాహపట్నం చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు కురేళ్ళ బేబీ, బొర్రా సత్యవతి, ఏఎంసి చైర్మన్ చేబోయిన వీర్రాజు, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, బొడ్డు నోబుల్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : అక్రమంగా తెలంగాణ మద్యం తరలిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు జీలుగుమిల్లి ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు తాటి ఆకుల గూడెం చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం తెలంగాణ రాష్ట్రం అశ్వరావుపేట మండలం కన్నాయిగూడెం గ్రామానికి చెందిన సున్నం సురేష్ కారులో 48 క్వార్టర్ మద్యం సీసాలు గుర్తించామన్నారు. వీటి విలువ రూ.6,240 ఉంటుందన్నారు. కారును, మద్యాన్ని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దొడ్డిదారిలో ప్రవేశ పెడుతున్న అప్రంటీస్ విధానానికి ఖండన

విశాలాంధ్ర – కొవ్వూరు : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశం ఆదివారం కొవ్వూరు లోని హెూలీ ఏంజెల్స్ హై స్కూల్లో జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎపిటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి ఏ సల్మాన్ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు వెట్టి చాకిరీకి గురి చేసే విధానాన్ని పోరాడి రద్దు చేయించుకున్నారని, తిరిగి నేడు గౌరవ వేతనం పేరుతో తిరిగి ప్రవేశ పెట్టాలనే విధానాన్ని వ్యతిరేకించాలని, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పుకొనే ప్రభుత్వం విద్యార్థులకు మేలు చేకూర్చేలా ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సిని అమలు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వవసలసిన అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాడి సాధించుకున్న హక్కులు, సౌకర్యాలను సంరక్షించుకోవడం కోసం నేడు పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. సమావేశాకి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీటీఎఫ్ ఉమ్మడి ప.గో.జిల్లా మాజీ అధ్యక్షులు కె ఎస్ జవహర్ మాట్లాడుతూ 117 జీ ఓ రద్దు చేయాలని డిమాండ్ చేశారు..మా ప్రభుత్వం వస్తే 117 జీ ఓ ను రద్దు చేస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని అన్నారు. సి పి ఎస్ ను వారంలో రద్దు చేస్తామని అన్న నాయకులు ఏమి చేశారో గమనించాలని అన్నారు. జిల్లా అధ్యక్షులు దున్నా దుర్గారావు మాట్లాడుతూ డి ఎ లు చెల్లించాలని, పెండింగ్ డి ఏ లు విడుదల చేయాలని, 11వ పి ఆర్ సి బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి సువర్ణ రాజు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు జి పి ఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.
అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా దున్నా దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా పి. సువర్ణ రాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి. గంగరాజు, ఎం. వెంకటరావు, ఎ. పద్మలత, బి సూర్యనారాయణ, కార్యదర్శులుగా ఎన్ రాజ శేఖర్, కె వి రాఘవులు, వి అనిత జ్యోతి, పి వి కృష్ణ మోహన్, బి రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ గా సలీం ఎన్నుకోబడ్డారు. ఎన్నుకోబడిన నూతన కార్యవర్గం చేత సాల్మన్ రాజు ప్రమాణం చేయించారు.

గ్లాసు వదిలి ఫ్యాన్ చెంతకు

విశాలాంధ్ర – రాజానగరం : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలో రాజకీయాలు పూటకో రంగు పులుముకుంటున్నాయి. మండలంలోని సూర్యారావుపేటకు చెందిన జనసేన పార్టీ ఎంపీటీసీ సభ్యులు వల్లభశెట్టి వెంకటరమణ(డబ్బు) పార్టీకి రాజీనామా చేసి ఆదివారం వైసీపీలో చేరారు. వెంకట రమణ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగ రీజనల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, రాయపరెడ్డి చిన్న,వైసీపీ నాయకులతో స్థానిక పార్టీ కార్యాలయం నుండి నరేంద్రపురం కూడలి వరకు ర్యాలీగా చేరుకొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, ఎంపీపీ మందారపు సీతరత్నం వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యులు వాసంశెట్టి పెద్ద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పుల్లంరాజు వర్మ, అనుచరులు

విశాలాంధ్ర – ఆత్రేయపురం : మండల కేంద్రం ర్యాలీ గ్రామానికి చెందిన ప్రముఖ నాయకులు పేర్చేర్ల నరసింహరాజు మనవడు పేర్చేర్ల పుల్లంరాజు వర్మ వైసీపీకి రాజీనామా చేసి తన అనుచరులు 400 మందితో కలసి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు, కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ బండారు సత్యానందరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గంటి హరీష్ మాధూర్, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు), రాష్ట్ర తెలుగురైతు ప్రధానకార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

అమలాపురంలో 92వ రోజు మహాసంకల్ప యాత్ర

విశాలాంధ్ర – అమలాపురం : అమలాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో 92వ రోజు మహా సంకల్ప యాత్రను నిర్వహించారు.

రాజబాబు పట్టణంలో ప్రతి కుటుంబానికి వెళ్లి కర పత్రాన్ని అందించి జనసేన పార్టీ సిద్ధాంతాలను పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజలకు వివరించారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పట్టణంలో సమస్యలు ఎప్పటికీ పరిష్కారం అవ్వటం లేదని పలువురు రాజబాబుకి వివరించారు. ఈ కార్యక్రమంలో సుధా చిన్న, ఆకుల బుజ్జి, కంపట్ల వెంకట రమేష్, మహా దశ నాగేశ్వరరావు, చిక్కాల సతీష్, సందడి శ్రీనుబాబు, చిక్కం సూర్య మోహన్, ముత్తబత్తుల శ్రీను, లంకె వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర – గండేపల్లి : రాష్ట్రాభివృద్ధి కావాలంటే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని జగ్గంపేట వైఎస్ఆర్‌సిపి ఇన్‌చార్జి తోట నరసింహ అన్నారు.

గండేపల్లి మండలం జెడ్ రాగం పేటలో పాలచర్ల వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ దివంగత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జడ్ రాగం పేటలో అనేక అభివృద్ధి పనులు చేయించానన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి యువ నాయకులు తోట రాంజీ, ఎంపీపీ చలగళ్ళ దొరబాబు, ఒబిన్ని సత్యనారాయణ, గుళ్ళా ఏడుకొండలు, మద్దిపట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం పవన్-పవన్ కోసం మనం

విశాలాంధ్ర – కాకినాడ : కాకినాడ రూరల్ నియోజకవర్గం రూరల్ మండలం సూర్యారావు పేట గ్రామం లైట్ హౌస్ ప్రాంతంలో జనం కోసం పవన్–పవన్ కోసం మనం కార్యక్రమంలో భాగంగా సూర్యారావు పేట లైట్ హౌస్ ప్రాంత జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటికి పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు జనసేన పార్టీ పిఏసి సభ్యులు, కాకినాడ రూరల్ ఇంచార్జ్ పంతం నానాజీ, తెలుగుదేశం నాయకులు సీతయ్యదొర, ఎజ్జల బాబ్జి. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికులు వారికి విన్నవించారు. డ్రైనేజీ వ్యవస్థ బాగోలేదని పంచాయతీ సిబ్బంది కాలువలు శుభ్రం చేయడం లేదని, మంచినీటి సమస్య అధికంగా ఉందని, త్రాగునీటికోసం ప్రభుత్వం నిర్వహించే వాటర్ ప్లాంట్ వినియోగం లేదని, ఎడిబి రోడ్ నుండీ పోర్ట్‌కి వెళ్లే భారీ వాహనాల వల్ల రోడ్లు పాడయి పోయి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ప్రతీ సంవత్సరం ధర్నాలు చేస్తే గానీ జీతాలు పెరగడం లేదన్నారు. మత్స్య కారులకి వేట సామాగ్రికి, పనులు చేసుకోవడానికి భవనం నిర్మించాలని, ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి కాళీ చేయించి పట్టాలు ఇవ్వకుండా రోడ్డున పడ వేశారని, పరిశ్రమ వ్యర్థలవల్ల అనేక ఆరోగ్య సమస్యలు, అర్హులకు పట్టాలు, పింఛన్లు ఇవ్వలేదని ఇలా అనేక సమస్యలు తెలిపారు. త్వరలోనే జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం రాబోతోందని మీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు సింహాద్రి, శోభనబాబు, ఎల్లబోయిన రామకృష్ణ, గరికిన సురేష్, సోదే ముసలయ్య, మల్లె భాస్కర్, సురదా శ్రీను, తదితరులు, జనసేన యువత మరియు తెలుగుదేశం నాయకులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

నేడు యథాతథంగా స్పందన

విశాలాంధ్ర –రాజమహేంద్రవరం రూరల్ : ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి స్పందన కార్యక్రమం ఫిబ్రవరి 5 వ తేదీ సోమవారం యధావిధిగా స్పందన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. కె. మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, అదేవిధంగా డివిజన్ స్థాయి లో ఆర్డీవో, మునిసిపల్ స్థాయి లో కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ప్రజలు నుంచి సంబంధిత సిబ్బంది స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ, మునిసిపల్, మండల, గ్రామ, వార్డు సచివాలయాలలో స్పందన ఫిర్యాదులు అంద చేయాలని కలెక్టర్ తెలియచేశారు. మండల స్థాయి అధికారులు అందరూ మండల ప్రధాన కేంద్రంలో ఒకే చోట హాజరై ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరించాలన్నారు.

జగన్ వైఫల్యాలను ఎండగడట్టాలి

విశాలాంధ్ర –భీమవరం: భీమవరం నియోజకవర్గం పట్టణంలోని 18,19 వార్డులలో నాయకులు మాగాపు ప్రసాద్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనసేన జండా స్థూపాలను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు ముఖ్య అతిథిగా విచ్చేసి పార్టీ జెండా స్తూపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మేమూ సిద్ధం కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లి జగన్ సర్కారు వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. పొలిట్ బ్యూరో సభ్యులు కనకరాజు సూరి, ఉంగుటూరు నియోజకవర్గం ఇంచార్జ్ ధర్మరాజు,పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు భాష, పోతుల శ్యామ్, ఎర్రంశెట్టి రాజేష్, కూచంపూడి వాసు , సిరిగినీడి హేమంత్ ,కాజా మొహిద్దీన్, ఎస్.కె.భాషా, భాషా, అలీషా, రఫీ, ఆకుల మావుళ్లు, సంకు మవుళ్లు, సుంకర నరేష్, జన సైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కవిటంలో 11నుండి అతిరుద్ర మహాయాగం

విశాలాంధ్ర-పోడూరు: మండలంలోని కవిటం గ్రామంలో ఈ నెల 11 నుండి 24 వరకు అతిరుద్ర మహాయాగం నిర్వహిస్తున్నామని ఈ మహా యాగం కార్యక్రమాలలో కవిటం పరిసర గ్రామాల భక్తులు పాల్గొనాలని సేవ్ టెంపుల్స్ భారత్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ కోరారు. పెనుమంత్ర మండలం నెలమూరుకు చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్ , శర్వాణి స్కూల్ ఆధ్వర్యంలో అతిరుద్ర మహాయోగ మహోత్సవాలను నిర్వహించటానికి . కవిటం వంతెన సెంటర్ సమీపంలో పాలకొల్లు- మార్టేరు రహదారి పక్కనే సువిశాలమైన ప్రదేశంలో యాగశాలను నిర్మించి గత కొద్దిరోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సేవ్ టెంపుల్స్ భారత్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ ఆదివారం యాగ మహోత్సవాలు నిర్వహించే ప్రాంగణాన్ని ఆదివారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మేడపాటి తమ్మిరెడ్డి, బిజెపి నాయకులు గుడిమెట్ల రామ కనకారెడ్డి ,సత్తి రామచంద్రారెడ్డి, కర్రి రామిరెడ్డిలతో మాట్లాడారు. యాగ మహోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని వారికి సూచించారు. అనంతరం గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం కవిటం గ్రామంలో అతి రుద్రమాహాయాగం నిర్వహించడం ఎంతో శుభ పరిణామం అన్నారు. జిల్లా, రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులంతా మహోత్సవంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ మీడియంలో చేరగోరు విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ కె.చంద్రశారద ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో చేరే ఎస్సీ, ఎస్టీ విద్యార్థినిలు 1-9-2011 నుండి 31-08-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఓసి, బిసి విద్యార్థినిలు 1-9-2013 నుండి 31-08-2015 మధ్య జన్మించి ఉండాలన్నారు. అభ్యర్థులు తూర్పుగోదావరి జిల్లాలో ఏదైనా ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి పూర్తి చేసి కుటుంబ ఆదాయం లక్ష రూపాయలు కంటే తక్కువ ఉన్న వారు అర్హులని అన్నారు. ఇంటర్మీడియట్లో ప్రవేశం పొందగోరు విద్యార్థినులు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో ఆన్లైన్ సెంటర్‌లో https//bragcet.apcfss.in. వెబ్ సైట్‌కు లాగిన్ అయి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో చేరగోరు విద్యార్థినులకు మార్చి10వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు, ఇంటర్మీడియట్‌లో చేరగోరు విద్యార్థినిలకు అదేరోజు ఉదయం 10 నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి కాంగ్రెస్

విశాలాంధ్ర – ప్రత్తిపాడు : మాజీ కేంద్రమంత్రి సిడబ్ల్యూసి మెంబర్ ఎంఎం పల్లం రాజు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా ఆదేశాల మేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఇంటింటా కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి, రాష్ట్ర కిసాన్ సెల్ కోఆర్డినేటర్ ఉమ్మిడి వెంకటరావు, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి, శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, వాకపల్లి,

పోతులూరు తదితర గ్రామాల్లో ఇంటింట కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరుతూ , ఈ నెల 9వ తేదీన కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా తునిలో నిర్వహిస్తున్న రోడ్ షోకి ప్రతి ఒక్కరు పాల్గొని ఈ రోడ్ షో కార్యక్రమం జయప్రదం చేయాలని వెంకటరావు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మోయేటి సూర్య ప్రకాష్ రావు, కొల్లు వీర గణేష్, కొప్పన కోటేశ్వరరావు, ఎనుమల రాజా, దిడ్డి రాజబాబు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర– నందిగామ: కరువు మిచాంగ్ తుఫాన్ వల్లతుఫాను వల్ల నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి లు మల్నీడి యల మందరావు, చుండూరు సుబ్బారావు కోరారు. రైతు

పేట సి ఆర్ భవన్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం కరువు తుఫాన్లతో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని రైతులకు కౌలు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ ఈనెల 8 తేదీన కలెక్టర్, ఆర్ డి ఓ, కార్యాలయా ల వద్ద ఆందోళన కార్యక్రమాలు వినతి పత్రాలు ఇవ్వాలని వారు తెలియ జేశారు. ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల 45 వేల రూపాయల అప్పుల భారం ఉన్నందువల్ల కనీసం రెండు లక్షల వరకు పంట రుణాలు రద్దు చేయాలని తెలంగాణ తరహాలో ఎకరాకు 15 వేల రూపాయల పెట్టుబడి సాయం అందించాలని ఈనెల 8 తేదీన జరగబోయే ఈ కార్యక్రమానికి రైతులు రైతాంగ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు పొల్లేడి నాగభూషణం, నందిగామ మండల సిపిఐ పార్టీ కార్యదర్శి మన్నే హనుమంతరావు, వేముల వీరయ్య, సిపిఐ సీనియర్ నాయకులు బలసపాటి రాంబాబు, పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర –గన్నవరం : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ అందరూ భాగస్వామ్యం కావాలని గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చిప్పాడ చంద్ర శేఖరరావు పిలుపు నిచ్చారు. క్యాన్సర్ నిర్మూ లనా దినోత్సవం సందర్భంగా ఆదివారం గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం మరియు ప్రధాన వీధులలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి కొత్త ప్రపంచం మనం చూడాలంటే ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. క్యాన్సర్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ సమాజంలో నివసించే వ్యక్తుల అలవాట్లను బట్టి ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి విక్టర్ బాబు, వాకర్స్ అసోసియేషన్ స్థాపిత నాయకులు సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత శక్తితో సామాజికాభివృద్ధి సాధించండి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విద్యార్థులు సంఘటిత శక్తితో సామాజికాభివృద్ధి సాధించే దిశగా కృషి చేయాలని వక్తలు సూచించారు. విస్సన్నపేట కోపా(కాపు అఫీషియల్స్ ఎయిడ్ ఫర్ పూర్), గుంటూరుకు చెందిన కృష్ణదేవరాయ పేద బలహీనవర్గాల సహాయనిధి ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వికాస్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ, విద్యార్థులు సామాజిక దృక్పదం కలిగిన విద్యను అందిపుచ్చుకోవాలన్నారు. సానుకూల దృక్పదంతో అపజయాల నుంచి విజయాల దిశగా పయనించాలన్నారు. విద్యాభివృద్ధి ద్వారా సమాజంలో ఉన్నత స్థానాలు సాధించేందుకు ఆస్కారం ఉందని గుర్తించాలన్నారు. కోపా వ్యవస్థాపక అధ్యక్షుడు డా.బండి గోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తులసి సీడ్స్ అధినేత తులసీ రామచంద్రప్రభు, ప్రముఖ విద్యావేత్త లక్కినేని ప్రసాద్, జెన్‌కో రిటైర్డ్ డీఈఈ చందన రామ్మోహనరావు పాల్గొన్నారు. అనంతరం కోపా సభ్యులు వీరిని ఘనంగా సన్మానించారు. కోపా కార్యదర్శి ఎరుబండి వెంకట కృష్ణారావు, కోశాధికారి తుంగల నరేంద్రబాబు, సంయుక్త కార్యదర్శి నిమ్మల గాంధీ తదితరులు పాల్గొన్నారు. సుమారు 300మంది విద్యార్థులకు ఉపకారవేతనాలను పంపిణీ చేశారు.

భవననిర్మాణ కార్మికసంఘం ఎన్నిక

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట భవన నిర్మాణ కార్మికసంఘం ఎన్నికను సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షునిగా మర్రిబోయిన అప్పారావు, కార్యదర్శిగా పోతురాజు శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పోతురాజు సత్యనారాయణ, ఆకుల శోభన్‌బాబు, సహాయ కార్యదర్శిగా బి.శివ సుబ్బారావు, కోశాధికారిగా ఎం.మంగపతిరావు, గౌరవాధ్యక్షులుగా గంజినబోయిన రాము, గంధం సుబ్బారావు, ఆకుల శ్రీనివాసరావు, సగ్గుర్తి శ్రీనివాసరావులను, రాజేష్, మురళీకృష్ణలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సిఐటీయూ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు ఈ ఎన్నికలు నిర్వహించగా, ముఖ్య అతిథులుగా వ్యకాసం జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు, కేవీపిఎస్ నాయకుడు ఎం.జ్ఞానరత్నం హాజరయ్యారు.

సిద్ధం అంటూ పోటాపోటీ ఫ్లెక్సీలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో సిద్ధం అంటూ వైసీపీ, జనసేన పార్టీలు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి. తొలుత శు

క్రవారం రాత్రి వైసీపీ నేతలు స్థానిక మండలపరిషత్తు కార్యాలయం వద్ద సీఎం జగన్‌తో కూడిన సిద్ధం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీ పక్కనే జనసేన నాయకులు శనివారం రాత్రి రాష్ట్ర అభివృద్ధి కోసం సంసిద్ధం అంటూ పవన్‌కల్యాణ్, చంద్రబాబు చిత్రాలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

జగన్‌కు మరో అవకాశం ఇవ్వండి

విశాలాంధ్ర- పెడన: వైయస్ జగన్మోహన్ రెడ్డి కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరొక అవకాశం కల్పించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెడన నియోజకవర్గ ఇంచార్జ్, పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము విజ్ఞప్తి చేశారు. పెడన మండలం నడుపూరు గ్రామపంచాయతీలో ఆదివారం ఉప్పాల రాము వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా నడుపూరు గ్రామంలోని గ్రామ పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఉప్పాల రాము మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద మధ్యతరగతి సామాన్య వర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జన రంజక పరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన హయంలో ముఖ్యంగా పేద మధ్య తరగతి వర్గ ప్రజలు ఆర్థికంగా బలోపేతం అయ్యారని పేర్కొన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని తెలిపారు. ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి పెడన ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, పెడన మండల ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి. అచ్యుతరావు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గరికపాటి చారుమతి రామానాయుడు, వైస్ ఎంపీపీలు యాదం రెడ్డి వరప్రసాద్, పరసవాకాలమ్మ, వైసిపి మున్సిపల్ కౌన్సిల్ పక్ష నాయకులు బళ్ల గంగయ్య, పెడన పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు మతిన్ ఖాన్, బెజవాడ నాగబాబు, మున్సిపల్ కౌన్సిలర్ మెట్ల గోపి, వైయస్ఆర్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోయ ఆంజనేయులు, పార్టీ ప్రధాన కార్యదర్శి పామర్తి సాంబశివరావు, ఎంపీటీసీలు అంకెం గిరిబాబు, బొల్లా ఉదయ్ కుమార్, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

డిటిఎఫ్ రజతోత్సవాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర- పెదపారుపూడి : డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభలు ఈ నెల 10, 11 తేదీలలో విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య క్యాంపస్ సెమినార్ హాలు–2లో డిటిఎఫ్ రజితోత్సవ సభలు 25 ఏళ్ళు నిండిన సందర్భంగా జరుగుతున్నందున ఎక్కువమంది పాల్గొని జయప్రదం చేయాలని డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ళ వరుణ కుమార్ ఒక ప్రకటనలో ఆదివారం ఆ సంఘ సభ్యులను కోరారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే నరహరి, ఎస్ వి రమణయ్య, పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు పి కృష్ణయ్య,లు పాల్గొంటారని ఆయన అన్నారు. మొదటి రోజు విద్యారంగ సమస్య, విద్యార్థి ఉపాధ్యాయ జెమిని ఉద్యమాల అవశ్యకత అనే అంశంపై ప్రొఫెసర్ జి హరి గోపాల్ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, మాతృభాష మాధ్యమం హార్థిక స్థితిగతులు అనే అంశంపై ప్రొఫెసర్ గార్లపాటి ఉమామహేశ్వరరావు నియత విద్య, సహజ విద్య అనే అంశంపై డి చంద్రశేఖర్ టీచర్ బౌద్ధ రచయిత ప్రసంగిస్తారని ఆయన అన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కె రాజేంద్రప్రసాద్, కే సాల్మన్ రాజులు ఈ విషయమై అవగాహన కల్పిస్తారని రావెళ్ల ఒక ప్రకటనలో వివరించారు.

టిడిపిలోకి వైసిపి మైనార్టీ, బిసి నాయకులు

విశాలాంధ్ర – గుడివాడ : గుడివాడ టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము సమక్షంలో ఆదివారం స్థానిక 17వ వార్డుకు చెందిన పలువురు మైనార్టీ, బిసి సంఘాలకు చెందిన నాయకులు. స్థానిక బైపాసు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో 17వ వార్డు వైసిపి, మైనార్టీ, బీసీ సంఘాల నేతలకు టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తనపై నమ్మకంతో మద్దతు తెలుపుతున్న ప్రజానీక నమ్మకాన్ని వమ్ముకానీయకుండా పనిచేస్తానన్నారు. 20 ఏళ్లుగా అన్ని రంగాల్లో గుడివాడ వెనుకబడిన ఉందన్నారు. అభివృద్ధి అంటే ఏంటో రాబోవు ఐదేళ్లలో చూపిస్తామన్నారు. చంద్రబాబు, పవన్‌కాల్యాణ్ కూటమికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీ, బత్తిన భద్రాచలం, శొంఠి అయ్యప్ప, మద్దుకూరు ప్రభాకర్, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లిలో సచివాలయ అనుబంధ భవనాలు ప్రారంభం

విశాలాంధ్ర – గుడివాడ : నందివాడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రజా ప్రతినిధులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆదివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొడాలి నాని మాట్లాడుతూ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు విద్యా, వైద్యం సంపూర్ణంగా అందించాలనే సంకల్పంతో సిఎం జగన్ తీసుకున్న చర్యలు ఎంతో విజయవంతమయ్యా యన్నారు. ఎవరెన్ని అవాంతరాలు సృష్టించిన ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న నిబద్ధత కలిగిన నాయకుడు జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, సర్పంచ్ రాధాకృష్ణ, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి, తుమ్మలపల్లి ఎంపిటీసీ వెన్నా ప్రభావతి, నాయకులు కొండపల్లి కుమార్‌రెడ్డి, చింతాడ నాగూర్, పాలేటి చంటి, గూడపాటి వెంకటేశ్వరరావు, దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ,కందుల నాగరాజు, అమృతబాబు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయవాడ రత్న మరుపిళ్ల చిట్టి

కాంస్య విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర –విజయవాడ(చిట్టినగర్): భారతరత్న మాదిరిగా విజయవాడ రత్న సర్దార్ మరుపిళ్ళ చిట్టి అని ఎంపీ కేశినేని నాని అన్నారు. కుల ప్రాంతీయ లకు అతీతంగా రాజ్యాంగ పరిరక్షణతో 1952 లో శాసనసభ్యునిగా ఎన్నికై అవిరళ కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ నగరాల ఐక్యవేదిక, విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో చిట్టినగర్ సెంటర్ వద్ద ఏపీ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాయన బాబ్జి, పోతిన వెంకటస్వామి వీరిద్దరి అధ్యక్షతన మరుపిళ్ల చిట్టి కాంస్య విగ్రహావిష్కరణ సభా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ కేశినేని శ్రీనివాసరావు(నాని), పశ్చిమ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ వైయస్సార్సీపి పశ్చిమ ఇంచార్జ్ ఎండి ఆసిఫ్, బిజెపి నాయకులు అడ్డురి శ్రీరామ్, భోగవల్లి శ్రీధర్ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ, పోరాటంలో కుటుంబాన్ని సైతం ఉద్యమ బాట నిలిపిన వాళ్లలో ఒకరని కొనియాడారు. నగరాల కులంలో ఆరాధ్య దైవంగా భావించే పెద్దలూ, మాజీ ఎమ్మెల్యే , ఆంధ్రజ్యోతి బిరుదు అందుకున్న, స్వాతంత్ర సమరయోధులు, విజయవాడ ప్రజల కోసం మిల్క్ ఫ్యాక్టరీ కొరకు భూమిని దానం చేసిన మహనీయులు, సర్దార్. మరుపిళ్ళ చిట్టి అని కొనియాడారు.

విగ్రహం ఆవిష్కరణ అనంతరం జనసేన వర్సెస్ వైయస్సార్సీపి ఆదర్శ ఆధిపత్యంతో సభా ప్రాంగణమంతా బాణాసంచా జగన్ పవన్ నినాదాలతో అధ్యంతం కొనసాగింది. ఈ కార్యక్రమంలో పోతిన స్వామి, పోతిన పైడి రావు, పోతిన వెంకటేశ్వర స్వామి, బాయన వెంకట్రావు, చిట్టి పెద్ద కుమార్తె మరుపిళ్ల ఉమా మోహన తిలక్, నాగ పావని, పిళ్ళా మోహన్ రావు, వైవి రావు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇండ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మండలంలో పలు గ్రామాలలో జరుగు తున్న నవరత్నాలు పేదలందరికీ ఇండ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి పి.సాయి బాబు ఆదివారం తనిఖీ చేశారు. పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో జగనన్న కాలనీలలో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులందరికీ గత రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభ మైంది.

పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ రిజిస్ట్రార్ హెూదా ఇవ్వడం తో,ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి, విఆర్వోలు కలిసి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ ప్రారంభించి పట్టాలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా వేములపల్లి, మొగులూరు గ్రామలను నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి పి.సాయిబాబు నవరత్నాలు పేదలందరి కీ ఇండ్లను గ్రామ సచివాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేయి ప్రక్రియను ఆదివారం కూడా జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. కంచికచర్ల డిప్యూటీ తాహసిల్దారు నాగుల్ మీరా ఆర్డీవో వెంట పాల్గొన్నారు.

జనసేన స్తూపం కూల్చివేత హేయం

విశాలాంధ్ర బ్యూరో–మచిలీపట్నం : ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయము లేకుండా ప్రైవేట్ స్థలంలో కట్టిన జనసేన జెండాదిమ్మను కూల్చివేయటం హేయమైన చర్య అని మచిలీపట్నం జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామకృష్ణ అన్నారు శుక్రవారం భాస్కరపురం లో ప్రైవేట్ స్థలంలో కట్టిన జండా దిమ్మను కూల్చివేయడానికి టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రయత్నించగా దానిని అడ్డుకున్నామని, దీనిపై కక్ష కట్టిన అసాంఘిక శక్తులు అర్ధరాత్రి ప్రోక్లైనర్ తో కూల్చివేయడం నీతిమాలిన చర్య అని, దమ్ముంటే ధైర్యంగా ఎదుర్కోవాలి కానీ దొంగ దెబ్బ తీయడం వారి పతనానికి పరాకాష్ట అని అన్నారు. ఈ విషయంపై ఆదివారం మచిలీపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మోటమర్రి బాబా ప్రసాద్ మాట్లాడుతూ ఇంతకుముందు రాజకీయాలు హుందాగా ఉండేవని ఈ ప్రభుత్వంలో దిగజారుడుతనం ఎక్కువైందని సిసి ఫుటేజ్ ఆధారంగా నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ జనసేన ఇంచార్జ్ కరుణాకర్, జనసేన నాయకులు గడ్డం రాజు, కొట్టే వెంకటరావు, పీవీ ఫణి కుమార్, జనసేన, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.